

రంజాన్ వేళలు
ఇఫ్తార్ సాయంత్రం గంటల 6.22(గురువారం)
సహేరీ ఉదయం గంటల5.05 (శుక్రవారం)

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బనగానపల్లె నియోజకవర్గానికి ఇచ్చిన హామీలేవీ అమలులోకి రాలేదు. ఆయన ప్రతిపక్ష నేతగా పాదయాత్ర చేసిన రోజుల్లో, ఆ తర్వాత సీఎం అయ్యాక నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని హామీలు ఇచ్చారు. నాపరాయి పరిశ్రమను ఆదుకుంటానని చెప్పారు. ఆయన దాదాపు ఐదేళ్లు అధికారం చెలాయించారు. మళ్లీ ఎన్నికలకు సిద్ధం అని ప్రకటిస్తున్నారు. నియోజకవర్గంలోని పరిస్థితులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే..! అన్న చందంగా ఉన్నాయి. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి కాలేదు. ఉన్న ప్రాజెక్టుల నిర్వహణకు నిధులు ఇవ్వలేదు. పూర్తి కాకుండానే ప్రారంభించిన అవుకు టన్నెల్ మిగతా పనులు ప్రశ్నార్థకంగా మారాయి. శంకుస్థాపన చేసిన జొళదరాసి ప్రాజెక్టు అతీగతీ లేదు. తన మాటలన్నీ నీటి మూటలే అని సీఎం రుజువు చేసుకున్నారు. ఒక్క సమస్యనూ పరిష్కరించని సీఎం జగన్ నేడు నియోజకవర్గానికి వస్తున్నారు. ఇంత కాలం అరచేతిలో స్వర్గం చూపించి, ఎన్నికలు రాగానే మళ్లీ ఓట్లు వేయించుకోడానికి ఏ ముఖం పెట్టుకుని వస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు.


దద్దనాల ప్రాజెక్టు

- మళ్లీ మభ్యపెట్టేందుకు నేడు బనగానపల్లెకు రాక
- నియోజకవర్గంలో పూర్తి కానీ ప్రాజెక్టుల పనులు
- నీరు లేక ఎండుతున్న పంటలు
- అధికార పార్టీ తీరుతో నాపరాయి పరిశ్రమపై భారం
- గత ఎన్నికల నాటి హామీలేమయ్యాయని ప్రశ్నిస్తున్న ప్రజలు

మాటల జగన్..!

నంద్యాల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి):

బనగానపల్లె నియోజకవర్గం కొలిమిగుండ్ల ప్రాంతంలో నాపరాయి పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయి. వివిధ కారణాల వల్ల ఈ పరిశ్రమ తీవ్ర ఒడిదుడుకులకు లోనయింది. ఈ సమస్యను పరిష్కరిస్తానని ప్రతిపక్ష నేతగా హామీ ఇచ్చారు. ఆయన అధికారంలోకి వచ్చాక ఈ పరిశ్రమల పరిస్థితి ఇంకా దిగజారింది. గత టీడీపీ ప్రభుత్వం రాయల్టీని చదరపు అడుగుకు రూ.8 నుంచి రూ.5కు తగ్గించారు. 30 శాతం ఉన్న డీఎంఎఫ్‌ను 10 శాతానికి తగ్గించారు. కానీ వైసీపీ ప్రభుత్వం రాయల్టీని రూ.5 నుంచి రూ.6కు, అలాగే హెక్టారుకు రూ.40 వేలు ఉన్న డెడ్ రెంట్ (వార్షిక బాడుగ)ను రూ.52 వేలకు పెంచింది. భారీ పరిశ్రమల విధించాల్సిన నిబంధనలను చిన్న పరిశ్రమైన నాపరాయి పరిశ్రమకు విధించడం వల్ల గనుల యజమానులు తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారన్న విమర్శలున్నాయి. ఇక సెక్యూరిటీ డిపాజిట్లను మూడు రెట్లు అధికంగా పెంచడం, డెడ్ రెంట్‌కు సంబంధించిన బిల్లులను ఇవ్వకుండా సతాయించడం వంటివి వైసీపీ ప్రభుత్వం చేస్తోంది. ఇలా నాపరాయి పరిశ్రమపై కక్షగట్టినట్లు ప్రవర్తించడంతో అవి మూతపడే పరిస్థితి ఏర్పడంది. తద్వారా వేల మంది కార్మికులు రోడ్డున పడుతున్నారు ఆదుకుంటామని మాటలు చెప్పి తమ జీవితాలను వైసీపీ ప్రభుత్వం కష్టాలపాలు చేసిందని పరిశ్రమల యజమానులు, కార్మికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పూర్తి కాకముందే ప్రారంభించి..

మాటలు చెప్పడంలో జగన్ ఆరితేరిన సీఎంగా గుర్తింపు తెచ్చుకున్నారు. కృష్ణా జలాలను కడప, చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు తరలించేందుకు చేపట్టిన జీఎన్ఎస్ఎస్ (గాలేరు - నగరి సుజల స్రవంతి) ప్రాజెక్టులో భాగంగా అవుకు టన్నెల్ పనులను తమ ప్రభుత్వమే పూర్తి చేసిందంటూ గొప్పలు చెప్పుకున్నారు. గత సంవత్సరం నవంబరు 30న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆర్భాటంగా టన్నెల్ కుడి సొరంగాన్ని ప్రారంభించారు. అయితే అవుకు టన్నెల్‌ను పూర్తి చేయడంలో జగన్ గొప్పతనం ఏమీ లేదని జరిగిన పనులను బట్టి తెలుస్తోంది. వాస్తవానికి ఏళ్లుగా సాగుతున్న అవుకు టన్నెల్ పనులు అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు దూరదృష్టితో ఓ కొలిక్కి తెచ్చారు. కేవలం ఎడమ సొరంగం ఫాల్ట్‌జోన్ పనులు, లైనింగ్ పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. వైసీపీ అధికారంలోనికి వచ్చి జగన్ సీఎంగా పగ్గాలు చేపట్టాక సంవత్సరంలోపు ఈ టన్నెల్ పనులు పూర్తి చేస్తామని గొప్పలు చేప్పారు. దీనికి తోడు రివర్స్ టెండరింగ్ పేరిట అప్పటికే పనులు చేస్తున్న కంపెనీని తప్పించి తమకు అనుకూలంగా ఉన్న కంపెనీకి కట్టబెట్టారు. రివర్స్ టెండరింగ్ ద్వారా మిగిలిన పనులకు ఓ కంపెనీ రూ.108 కోట్లతో పనులు చేజిక్కించుకుని, టన్నెల్ పనులను మొదలుపెట్టింది. అయితే వైసీపీ ప్రభుత్వం బిల్లులు సరిగా చెల్లించకపోవడంతో ఈ పనులు నెమ్మదించాయి. దీంతో ఎపుడో పూర్తి కావాల్సిన టన్నెల్ పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. కుడి సొరంగంలోని నాన్‌ఫాల్ట్‌జోన్‌లోని 200 మీటర్ల లైనింగ్ పనులు, ఆర్చి పనులు పెండింగ్‌లో ఉండగా, ఎడమ సొరంగంలోని నాన్‌ఫాల్ట్ జోన్‌లోనూ 800 మీటర్లు లైనింగ్ పనులు పెండింగ్‌లో ఉండగానే.. అవుకు టన్నెల్ పూర్తి చేశామన్న క్రెడిట్ కొట్టేసేందుకు సీఎం వైఎస్ జగన్ కుడి టన్నెల్ ద్వారా నీటిని విడుదల చేశారు. అయితే వీటికి సంబంధించిన పనులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి తోడు మూడో టన్నెల్ పనులపై ఎలాంటి స్పష్టతలేదు.


నాపరాయి పరిశ్రమలు

ఏమైంది జొళదరాశి..

2019లో సీఎం జగన్ కుందూ నదిపై జోలదరాసి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత దాని గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. దీనికి సంబంధించిన గత రెండేళ్లుగా బడ్జెట్‌లో నామమాత్రపు నిధులు కేటాయిస్తున్నారు. ఈ నిధులతో భూ సేకరణ సర్వే జరిపేందుకు కూడా సరిపోవు.


జొలదరాశి ప్రాజెక్టు ఏర్పాటు చేయనున్న ప్రాంతం

అవుకు రిజర్వాయర్ నిర్వహణకు కరువు..

అవుకు జలాశయం నిర్వహణకు కూడావైసీపీ ప్రభుత్వం నిధులు కేటాయించడం లేదు. రిజర్వాయర్‌ను మూడంచెల భద్రతతో నిర్మించిన మట్టికట్టలు కోతకు గురవుతున్నాయి. దీంతో మట్టి కట్టల భద్రత ప్రశ్నార్థకంగా మారడంతో రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం నిల్వ చేసిన సమయంలో అక్కడక్కడ నీరు లీకేజీ అవుతోంది. ఇవి ఎక్కువైతే రిజర్వాయర్ మనుగడకే ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంది. ఇక రిజర్వాయర్ స్లూయిజ్ గేట్లు నిర్వహణ కూడా సరిగా లేకపోవడంతో దెబ్బతిన్నాయి. దీనివల్ల నీరు వృథాగా కిందికి పోతున్నాయి. చివరి ఆయకట్టుకు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. గతంలో చెప్పిన మాటలేవీ అమలులోకి రాకపోయినా.. మళ్లీ ఎన్నికల సందర్భంగా సీఎం నియోజకవర్గానికి వస్తున్నారు. మరోసారి బనగానపల్లె ప్రజలను మోసం చేయడానికి జగన్ వస్తున్నాడని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.

దద్దనాలపై ఎందుకీ నిర్లక్ష్యం...

బనగానపల్లె నియోజకవర్గంలోని ఒకే ఒక చిన్న నీటి పారుదల ప్రాజెక్టు దద్దనాల ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టుకు సమీపంలోని ఎస్సార్బీసీ నుంచి నీటిని ఎత్తిపోస్తే లాభం ఉంటుందన్న ఉద్దేశంతో గత టీడీపీ ప్రభుత్వం రూ.21.01 కోట్లు నిధులతో పనులు చేపట్టి 2019లో పూర్తి చేసింది. ఎస్సార్బీసీ ద్వారా నీటిని దద్దనాల ప్రాజెక్టుకు తరలించింది. ఆ తర్వాత అధికారంలోనికి వచ్చిన వైసీపీ ప్రభుత్వ ఈ ప్రాజెక్టు నిర్వహణను పూర్తిగా పట్టించుకోవడం మానేసింది. నీటిని ఎస్సార్బీసీ నుంచి ఎత్తిపోసేందుకు అయ్యే విద్యుత్ బిల్లులకు కూడా నిధులు విడుదల చేయకుండా సతాయించింది. దీంతో ఎత్తిపోతల పథకం కాస్త అటకెక్కింది. నీటి తరలింపు ఆగిపోవడంతో ప్రాజెక్టులో నీటిమట్టం పూర్తిగా తగ్గిపోయింది. దీంతో ఆయకట్టు రైతులకు నీరందకపోవడమే కాకుండా, చుట్టు పక్క గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటాయి.


కోతకు గురైన అవుకు రిజర్వాయర్ మట్టికట్టలు


బనగానపల్లె పట్టణంలో బంకులు తొలగిస్తున్న దృశ్యం

సీఎం వస్తే బంకులు తీసేస్తారా?

- పొదుపు మహిళలు సభకు తప్పక రావాలని ఆదేశం
- బారికేడ్లతో ఇబ్బందిపడ్డ పట్టణ ప్రజలు

బనగానపల్లె, మార్చి 13: సీఎం వస్తున్నారని పోలీసులు చిరు వ్యాపారుల పొట్ట కొట్టారు. ఎప్పటి నుంచో బంకులు ఏర్పాటు చేసుకొని బతుకుతున్న వారిని వీధిపాలు చేశారు. ఈ వ్యవహారం మీద పట్టణ ప్రజలు నివ్వెరపోయారు. సీఎం వస్తే మాత్రం పేదల జీవితాలతో ఆడుకుంటారా? అని ప్రశ్నిస్తున్నారు. బనగానపల్లె పట్టణానికి సీఎం జగన్ గురువారం రానున్నారు. ఈ సందర్భంగా ఏళ్ల తరబడి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదుట చిరు వ్యాపారులు వేసుకున్న బంకులను తొలగించారు. సీఎం కాన్వాయ్‌కి అడ్డమని రోడ్డు పక్కన ఉన్న గాజుల అంగళ్లు, కూరగాయల అంగళ్లు, చిరువ్యాపారుల బంకులను తొలగించారు. పోలీసులు గాజులను కూడా పగులగొట్టారని చిరు వ్యాపారులు ఆవేదన చెందారు. సీఎం వస్తున్నారనే సాకుతో తమ బంకులను తొలగించడం దారుణమన్నారు. సీఎం జగన్ పట్టణంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు హాజరవుతారు. రూ22 కోట్ల వ్యయంతో నిర్మించిన ఏరియా ప్రభుత్వ వైద్యశాల ప్రారంభోత్సవం చేస్తారు. ఈ సందర్భంగా అధికారుల వ్యవహార శైలి పలు విమర్శలకు దారి తీసింది. సీఎం సభను విజయవంతం చేయడానికి ప్రైవేటు పాఠశాల వాహనాలను పొదుపు మహిళలను, వైసీపీ కార్యకర్తలను తరలించడానికి తమ ఆధీనంలోకి బలవంతంగా తీసుకున్నారు. పొదుపు మహిళలు తప్పనిరిగా సీఎం సభకు హాజరు కావాలని వెలుగు అధికారులు హుకుం జారీ చేశారు. అలాగే సాయంత్రం సీఎం కాన్వాయ్ ట్రయల్ రన్ను పేరుతో ట్రాఫిక్‌ను చాలాసేపు నిలిపివేశారు. దీంతో పాఠశాల బస్సులు, లారీలు, ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అలాగే శివరాం టాకీస్ లైన్‌లో బారికేడ్లు వేసి ట్రాఫిక్‌ను పూర్తిగా మూసివేశారు. దీంతో ఆ ప్రాంతంలో నివసించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

సీఎం పర్యటన వివరాలు: గురువారం సీఎం జగన్ కర్నూలు, నంద్యాల జిల్లాలో పర్యటించనున్నారు. కర్నూలులోని ఓర్వకల్లులో నేషనల్ లా యూనివర్సిటీ భూమి పూజలో పాల్గొంటారు. బనగానపల్లెలో ఈబీసీ నేస్తం నిధులకు బటన్ నొక్కనున్నారు. బనగానపల్లె పట్టణంలో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ప్రారంభింస్తారు. ప్రతిని ప్రారంభించడానికి సీఎం జగన్ వస్తున్నారు.


వాహనాలు వెళ్ల కుండా బందోబస్తును నిర్వహిస్తున్న పోలీసులు

ఏర్పాట్లలో అధికారులు: సీఎం జగన్ పర్యటనకు కలెక్టరు శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్‌రెడ్డి హెలిప్యాడ్‌ను, పట్టణంలోని ఉన్నతపాఠశాల మైదానంలో నిర్వహించే బహిరంగ సభ వేదికను బుధవారం పరిశీలించారు. సీఎం భద్రతా ఏర్పాట్లను ఎస్పీ రఘువీర్‌రెడ్డి స్వయంగా పరిశీలించారు. హెలిపాడ్ సహా సభావేదిక ప్రాంతం, గ్యాలరీలో విధులు నిర్వహించే అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అన్నారు.

ఏప్రిల్ 6 నుంచి ఉగాది మహోత్సవాలు


మాట్లాడుతున్న ఈవో పెద్దిరాజు

శ్రీశైలం, మార్చి 13: శ్రీశైల మహాక్షేత్రంలో ఏప్రిల్ 6 నుంచి 10 వరకు ఐదు రోజులపాటు ఉగాది మహోత్సవాలను నిర్వహించనున్నారు. ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లపై బుధవారం ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు కార్యాలయ భవనంలోని సమావేశ మందిరంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆలయ డిప్యూటీ కార్యనిర్వహణాధికారి, అన్ని విభాగాధిపతులు, పర్యవేక్షకులు, ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు, స్థానాచార్యులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు. అలాగే శ్రీశైలం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు పాల్గొన్నారు. సమావేశంలో ఈవో పెద్దిరాజు మాట్లాడుతూ మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించినందుకు సిబ్బంది అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఉగాది మహోత్సవాలకు కర్ణాటక రాష్ట్రం నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేస్తారని ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా కాలిబాట మార్గంలో వెంకటాపురం, నాగలూటి, దామెర్లకుంట, పెద్దచెరువు, మఠంబావి, భీముని కొలను, కైలాస ద్వారం ప్రాంతాలలో సదుపాయాల కల్పనకు లోటు లేకుండా చూడాలన్నారు. ఉత్సవాలలో స్వామి, అమ్మవార్ల కైంకర్యాలన్నీ సంపూర్ణంగా జరిపించాలన్నారు. అలాగే క్యూలైన్లలో ఏర్పాట్లు, క్షేత్ర పరిధిలో తాత్కాలిక వసతి, మంచినీటి సరఫరా, భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు స్వచ్ఛంద సేవకుల నుంచి సహకారం, కాలిబాట మార్గం, క్షేత్ర పరిధిలో అన్నదాన శిబిరాలను నిర్వహించే దాతలకు దేవస్థానం తరపున సహకారం, ఉత్సవాలలో ఆలయానికి, క్షేత్రమంతటా విద్యుద్దీకరణ ఏర్పాటు, వైద్యశిబిరాల ఏర్పాటు, సూచిక బోర్డుల ఏర్పాటు, పుష్పాలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, పారిశుధ్యం, సమాచార కేంద్రాల ఏర్పాట్లు తదితర ఏర్పాట్లను సంబంధిత విభాగాధిపతుల పర్యవేక్షణలో ఆయా ఏర్పాట్లన్నీ పూర్తి చేయాలని ఈవో ఆదేశించారు.

నాన్నా ఎందుకిలా చేశావు?


తండ్రి శాంతికుమార్

ఇతను తండ్రి అనే మాటకు కళంకం తెచ్చాడు. మాటలు కూడా నేర్వని చిన్నారిని గొంతుకోసి దారుణంగా హత్య చేశాడు. 18 నెలల పసిపాప తండ్రి దగ్గరికి ఎప్పటిలాగే నవ్వుతూ, తుళ్లుతూ వెళ్లి ఉంటుంది. కానీ ఆ తండ్రికి తన కూతురు పుట్టుక మీదే అనుమానం. దాంతో అతడు క్రూరంగా తయారయ్యాడు. బుడిబుడి అడుగుల పాపను గొంతుకోసి హత్య చేశారు. ఆ పాపకే తిరిగి ప్రాణం వస్తే...తండ్రితో ఇలా అంటుందేమో..

ఎందుకు నాన్నా నన్ను చంపావు?
నేనేం పాపం చేశాను?
నీకు కూతురుగా పుట్టడమే
నేను చేసిన తప్పా?
నన్ను చంపడానికే కన్నావా?
నిద్రలేపి నన్ను తీసుకెళ్తుంటే
సరదాగా ఆడుకుంటావని ఆశపడ్డా
ఇలా నా గొంతు కోస్తావనుకోలేదు..
అమ్మపై అనుమానమా నాన్నా
అమ్మ అలాంటిది కాదు నాన్నా
మనం ముచ్చటగా ఉంటామనుకున్నా...
ఎందుకు నాన్నా ఇలా చేశావు..
రోజూ నువు ఇంటికి రాగానే
నీ చేతుల్లో వాలిపోయే దాన్ని కదా..
నీవు నన్ను ఎత్తుకుంటే
నీ మెడ చుట్టూ చేతులు వేసి
మురిసిపోయేదాన్ని కదా నాన్నా..
మరి నా గొంతు కోయడానికి
నీకు చేతులు ఎలా వచ్చాయి నాన్నా
నీకెన్ని అనుమానాలు ఉన్నా
నేను నీ బిడ్డనే నాన్నా..


వర్షిణి ఫైల్)

భార్యపై అనుమానంతో..

బిడ్డను చంపిన తండ్రి




- జంపాపురంలో దారుణం

కోసిగి, మార్చి 13: భార్యపై అనుమానంతో 18 నెలల కన్నబిడ్డను చంపేశాడు. ఈ ఘటన కర్నూలు జిల్లా కోసిగి మండలం జంపాపురం గ్రామంలో జరిగింది. గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఖగల్లు శాంతి కుమార్, ఆశీర్వాదమ్మలకు మూడేళ్ల క్రితం పెళ్లయింది. వీరికి వర్షిణి అనే 18 నెలల పాప ఉంది. శాంతకుమార్ భార్యపై అనుమానం పెంచుకున్నాడు. ఆశీర్వాదమ్మ కొనసాగిస్తున్న వివాహేతర సంబంధానికి పాప పుట్టిందని భార్యా బిడ్డల మీద ద్వేషం పెంచుకున్నాడు. దీంతో మంగళవారం రాత్రి చిన్నారిని పశువుల పాకలోకి తీసికెళ్లి కత్తితో గొంతుకోసి హత్య చేశాడు. ఇంట్లో కూతురు కనిపించకపోయే సరికి ఆశీర్వాదమ్మ అంతటా వెతికింది. పశువుల పాకలో రక్తపుమడుగులో చిన్నారిని చూసి బోరున విలపించింది. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు దిగ్భ్రాంతి చెందారు. అయితే గ్రామస్థులు శాంతికుమార్‌ను ఓ గదిలో బంధించారు. బుధవారం ఉదయం ఈ విషయం తెలిసి సీఐ ప్రసాద్, ఏఎస్ఐ నాగరాజు గ్రామానికి చేరుకొని వివరాలు సేకరించారు. కూతురును హత్య చేసిన శాంతి కుమార్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ప్రసాద్ తెలిపారు. భార్యపై అనుమానంతోనే తన కూతురుని హత్య చేసినట్లు నిందితుడు ఒప్పుకున్నాడని ఆయన తెలిపారు.


వర్షిణి ఇంటి ముందు గుమికూడిన ప్రజలు



రోదిస్తున్న తల్లి ఆశీర్వాదమ్మ



కిడ్నీలను కాపాడుకోండి

- చివరి దశలో చికిత్స కష్టం
- మూత్రపిండాలు పని చేయకపోతే ప్రాణాలకే ముప్పు
- నేడు వరల్డ్ కిడ్నీ డే

కర్నూలు(హాస్పిటల్), మార్చి 13: మూత్రపిండాలు శరీరం నుంచి వ్యర్థపదార్థాలను తొలగించి శరీరంలో ద్రవ పదార్థాల సమతుల్యతను కాపాడుతాయి. రక్తపీడనాన్ని క్రమబద్ధీకరించి, గట్టి ఎముకల తయారీకి ఎర్ర రక్తకణాల ఉత్పత్తికి సహకరిస్తాయి. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, ఒత్తిడి తదితర సమస్యలతో ఉమ్మడి జిల్లాలో కిడ్నీ సంబంధిత రోగాలు పెరుగుతున్నాయి. రోగులు కిడ్నీ దెబ్బతిన్న తర్వాత దశలో ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. దీంతో కిడ్నీ మార్పిడి అనివార్యమవుతున్నది. ప్రతి ఏడాది మార్చి రెండో గురువారం కిడ్నీ జబ్బులపై అవగాహన పెంచేందుకు డబ్ల్యూహెచ్‌వో ఈ ఏడాది వరల్డ్ కిడ్నీ డే నిర్వహిస్తోంది. ఈ ఏడాది డబ్ల్యూహెచ్‌వో కిడ్నీ ఆరోగ్యం అందరికీ అనే నినాదం ఇచ్చింది.



కిడ్నీలు దెబ్బతింటే శరీరమంతా ప్రభావితమవుతుంది. ఒంట్లో వ్యర్థాలు పోగుపడి చెత్త కుప్పలా తయారవుతుంది. తొలిదశలో ఏమీ లక్షణాలు కనిపించవు. నెమ్మదిగా కిడ్నీల సామర్థ్యం మందగించి, చివరికి కిడ్నీ ఫెయిల్యూర్‌కు దారి తీస్తుంది. జబ్బు ముదరకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతి ఆరు నెలలకు ఒకసారి పరీక్షలు చేయించుకోవాలి.

కర్నూలు సర్వజన వైద్యశాలలో కిడ్నీ మార్పిడీ ఆపరేషన్లు

కర్నూలు సర్వజన వైద్యశాలలో 2019 ఆగస్టు 19న రాయలసీమలోనే తొలిసారిగా ఓ రోగికి కిడ్నీ మార్పిడీ ఆపరేషన్ చేశారు. మళ్లీ 2024 ఫిబ్రవరి 16న కర్నూలు జీజీహెచ్‌లో ఇద్దరు రోగులకు కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు నిర్వహించారు. యురాలజీ విభాగపు హెచ్‌వోడీ డా.సీతారామయ్య, అసోసియేట్ ప్రొఫెసర్ డా.ముత్యశ్రీ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.రాజారెడ్డి, నెఫ్రాలజీ హెచ్‌వోడీ డా .అనంత్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. ఫక్కిరెడ్డి కిడ్నీ మార్పిడీ ఆపరేషన్‌లో పాల్గొన్నారు.

నెలకు 700 మంది రోగులు



కర్నూలు జీజీహెచ్‌లోని నెఫ్రాలజీ విభాగానికి నెలకు 700 మంది రోగులు వస్తుంటారు. వారంలో ప్రతి బుధవారం, శనివారం ఓపీ ఉంటుంది. ప్రతి నెలా 150 మంది అడ్మిషన్ పొందుతుంటారు. దీర్ఘకాలిక కిడ్నీ సమస్యలు ఉన్నవారు డయాలసిస్ చేయించుకునేవారు వస్తుంటారు. వీరికి డయాలసిస్ చేసేందుకు ఏవీ ఫిస్టులా సెంట్రల్ లైన్, పర్మినెంట్ క్యాథ్ వంటి చికిత్సలు అందిస్తున్నారు.

ప్రాథమిక దశలోనే గుర్తించాలి



మధుమేహం, రక్తపోటు ఉన్న వారు వాటిని అదుపులో ఉంచుకుంటే కిడ్నీ జబ్బులు రావు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి కిడ్నీ పరీక్షలు సీరమ్ క్రియాటిన్, యూరిన్ అల్బ్యూమిన్ చేయించుకోవాలి. ఇటీవల కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో కూడా కిడ్నీ కేసులు అధికమవుతున్నాయి. యూరిన్ తగ్గిపోవడం, చర్మం పాలిపోవడం, కాళ్లనొప్పులు ఉంటే జాగ్రత్త పడాలి.

\- డా.సిద్ధార్థ్ హెరూర్, నెఫ్రాలజిస్టు, మెడికవర్ హాస్పిటల్, కర్నూలు

ఈ లక్షణాలుంటే..

- మధుమేహం, బీపీతో బాధపడేవారు..
- రాత్రి నిద్రలో లేచి మూత్రానికి వెళ్లేవారు..
- ఒళ్లు వాపులు ఉన్నవారు, కాళ్ల వాపులు ఉన్నవారు..
- మూత్రవిసర్జనలో మార్పులు, మూత్రం తక్కువగా రావడం..
- చర్మం పొడి, దురద ఉంటే.. తప్పక వైద్యులను సంప్రదించాలి. కిడ్నీ పరీక్షలు చేయించుకోవాలి.

నేడు కిడ్నీ వ్యాధిపై అవగాహన ర్యాలీ



అంతర్జాతీయ కిడ్నీ వ్యాధుల నివారణ దినాన్ని పురస్కరించుకుని ఈ నెల 14వ తేదీన కర్నూలు ప్రభుత్వాసుపత్రి నుంచి రాజ్‌విహార్ సెంటరు వరకు తిరిగి హాస్పిటల్ వరకు కిడ్నీ వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నారు. ఈ ర్యాలీలో కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్, నెఫ్రాలజీ వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొంటారు.

\- డా.ఎస్.అనంత్, నెఫ్రాలజీ విభాగాధిపతి, కర్నూలు ప్రభుత్వాసుపత్రి

కిడ్నీల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



కిడ్నీల ఆరోగ్యాన్ని కాపాడుకోడానికి ప్రతి రోజు నాలుగు నుంచి 5 లీటర్లు నీటిని తాగాలి. వ్యాయామం చేయాలి. పెయిన్ కిల్లర్ యాంటి బయాటిక్స్‌కు దూరంగా ఉండాలి. ముఖ్యంగా మధుమేహం, బీపీ ఉన్న వారు తరచూ పరీక్షలు చేయించుకోవాలి.

\- డా.ఫక్కిరెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్, నెఫ్రాలజీ విభాగం, కర్నూలు జీజీహెచ్

కొనసాగుతున్న గురు వైభవోత్సవాలు

- రాఘవరాయలకు విశేష పంచామృతాభిషేకం
- అలరించిన భారతనాట్యం..



సంస్థాన పూజ చేస్తున్న మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం, మార్చి 13: మంత్రాలయంలో శ్రీగురు రాఘవేంద్రస్వామి గురువైభోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మూడో రోజు బుధవారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో రాఘవేంద్రస్వామి మూలబృందావనానికి విశేష పంచామృతాభిషేకం నిర్వహించి బంగారు కవచం, వెండి వివిధ రకాల పుష్పాలతో అలంకరించి హారతులు ఇచ్చారు. అంతకుముందు పూర్ణబోధ పూజామందిరంలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు, మూలరాములు, జయరాములు, దిగ్విజయరాములకు సంస్థాన పూజ చేసి హారతులు ఇచ్చారు. ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలకు పాదపూజ చేసి చెక్క, వెండి, రజిత గజవాహనం, బంగారు, నవరత్నాల రథాలపై వైభవంగా ఊరేగించారు. గురుభక్తి ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి యోగీంద్ర కల్యాణ మండపంలో బెంగుళూరుకు చెందిన కల్చరల్ చారిటబుల్ ట్రస్టు శివలీలచే నిర్వహించిన భరతనాట్యం భక్తులను కనువిందు చేసింది. అదే బెంగుళూరు చెందిన విద్వాన్ సోషలేసమీరాచార్‌చే దాసవాణి సాహిత్యం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పండిత కేసరి రాష్ట్రపతి అవార్డు గ్రహీత విద్వాన్ రాజాఎస్‌గిరిరాజాచార్, ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేశ్‌జోషి, శ్రీపతాచార్, ఐపీ నరసింహమూర్తి, వాధిరాజాచార్, ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్, సూపరింటెండెంట్లు అనంతపురాణిక్, విజయేంద్రాచార్, రవికులకర్ణి, డీఎం ఆనందరావు, ద్వారపాలక అనంతస్వామి, వాఘేంద్రచార్, రమణారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖులకు అవార్డుల ప్రదానం



ప్రమోద్ కుమార్‌కు అవార్డు ప్రదానం చేస్తున్న పీఠాధిపతి

గురువైభోత్సవాల్లో మూడో రోజు బుధవారం రాత్రి యోగీంద్ర కళామండపంలో ప్రముఖులకు పీఠాధిపతి అవార్డులు ఇచ్చారు. హైదరాబాదు యశోద ఆసుపత్రి ప్రముఖ గుండె వైద్యనిపుణులు ప్రమోద్ కుమార్, కర్ణాటకలోని విజయనగర జిల్లా ఎస్పీ బీఎల్ శ్రీహరిబాబు, బెంగుళూరు చెందిన స్కాలర్ వీణా భన్నంజే, అనంతపురం దాస సాహిత్య ప్రాజెక్టు నిర్వాహకురాలు యశోదమ్మ, సామాజికవేత్త జయతీర్థులకు అవార్డులు అందజేశారు.

ధార్మిక సేవలు స్ఫూర్తిదాయకం

త్రిదండి చిన్న జీయర్ స్వామీజీ



గోదా గోకులానికి వస్తున్న చిన్న జీయర్ స్వామీజీ

కర్నూలు(కల్చరల్), మార్చి 13: కర్నూలు నగర శివారులోని మామిదాలపాడులో వెలసిన గోదాదేవి సమేత శ్రీరంగనాథ స్వామి దేవస్థానం (గోదా గోకులం)లో నిర్వహిస్తున్న ధార్మిక సేవలు ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని శ్రీ త్రిదండి రామనుజ చిన్న జీయర్ స్వామీజీ అన్నారు. గోకులంలో కొనసాగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు రెండోరోజు బుధవారం నిర్వహిస్తున్న కార్యక్రమాలకు ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా చిన్న జీయర్ స్వామీజీకి గోకులంలో వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు బృందం పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం చిన్న జీయర్ స్వామి మాట్లాడుతూ సమాజంలో ఆధ్యాత్మిక భావనలు పెంపొందించే అనేక కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని చెప్పారు. బ్రహ్మోత్సవాల్లో రెండో రోజు కార్యక్రమంగా ఉదయం ధ్వజారోహనం, శేషవాహనం, తిరుమంజనం, సాయంత్రం కల్పవృక్ష వాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను గోకులంలోని తిరుమాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. శ్రీమన్నారాయణాచార్య స్వామి యాజ్ఞికత్వంలో అర్చకులు రమేశ్ బట్టర్, కిరణ్ బట్టర్ బృందం ఈ క్రతువులు నిర్వహించారు. కార్యక్రమంలో పాలాది సుబ్రహ్మణ్యం, బాలసుధాకర్, భూమా కృష్ణమోహన్, వేముల జనార్ధన్, తల్లం సురేష్, తలుపుల శ్రీనాథ్, వెంకట సుబ్రహ్మణ్యం, టీటీడీ ధర్మప్రచార పరిషత్ ఈవో డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, సాయి సేవకుడు మహాబలేష్ తదితరులు పాల్గొన్నారు.

విష ద్రావణం తాగి వివాహిత మృతి

తల్లి పాలు తాగి పసికందు మృతి



ఇందుమతి (ఫైల్)

శిరివెళ్ల, మార్చి 13: మండలంలోని యర్రగుంట్ల గ్రామంలో ఇందుమతి (29) అనే వివాహిత విష ద్రావణం తాగి మృతి చెందినట్లు ఎస్‌ఐ సురేష్ బుధవారం తెలిపారు. వివరాల్లోకి వెళ్తే యర్రగుంట్లకు చెందిన వెంకటసుబ్బమ్మ, వెంకటసుబ్బారెడ్డిల కుమార్తె ఇందుమతిని చాగలమర్రి మండలం తోడెండ్లపల్లెకు చెందిన సతీష్‌రెడ్డికి ఇచ్చి వివాహం జరిపించారు. కొన్ని నెలల కిందట ప్రసవం కోసం ఇందుమతి స్వగ్రామమైన యర్రగుంట్లకు వచ్చింది. గత ఏడాది తల్లి వెంకటసుబ్బమ్మ మృతి చెందడంతో ఆమె మరణాన్ని జీర్ణించుకోలేక ఇందుమతి మానసికంగా బాధపడుతుండేదని అన్నారు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది మంగళవారం రాత్రి విష ద్రావణం తాగింది. అనంతరం మూడు నెలల పసికందుకు తల్లిపాలు ఇవ్వడంతో విష ద్రావణం ప్రభావం వల్ల ముక్కుపచ్చలారని చిన్నారి మృత్యువాత పడింది. ఇందుమతి నంద్యాల ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందిందని అన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేష్ వెల్లడించారు.

షెడ్యూల్ రాక ముందే పనులు ప్రారంభించాలి

ఇంజనీరింగ్ అధికారులకు జడ్పీ సీఈఓ నాసరరెడ్డి ఆదేశాలు



మాట్లాడుతున్న సీఈఓ జి.నాసరరెడ్డి

కర్నూలు(న్యూసిటీ), మార్చి 13: ఎన్నికల షెడ్యూల్ రాకముందే గ్రామాలు, పట్టణాల్లో పనులు ప్రారంభించాలని జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి ఇంజనీరింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా పరిషత్ మినీ సమావేశం భవనంలో జరిగిన ఏడు స్థాయి సంఘ సమావేశాలకు జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ దిల్షాద్ నాయబ్ అధ్యక్షత వహించగా సీఈఓ జి. నాసరరెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ గ్రామాల్లో ఇప్పటికే పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు అయ్యాయని, యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పనులు ప్రారంభించడానికి అగ్రిమెంటు కావాలని, మెటీరియల్ సిద్ధం చేసుకోవాలని అన్నారు. షెడ్యూల్ వచ్చిందంటే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినట్లేనని ఆయన అన్నారు. ప్రధానంగా ఉమ్మడి జిల్లాలో వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జడ్పీటీసీలు దివ్య, సుధాకర్‌రెడ్డి, సుంకన్న, ఉరుకుందమ్మ, పోచా జగదీశ్వరరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, అనసూయమ్మ, ఉమ్మడి జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఆరంభమైన జీవీ మాల్ షోరూమ్

షోరూమ్‌ను ప్రారంభించిన సినీ నటి సంయుక్త మీనన్



షోరూమ్‌ను ప్రారంభిస్తున్న హీరోయిన్ సంయుక్తమీనన్



షోరూమ్ వివరాలను వెల్లడిస్తున్న ఎండీ జి.ఉమామహేశ్వర రావు

కర్నూలు(కల్చరల్), మార్చి 13: నగరంలోని పార్కురోడ్డులో కొత్తగా ఏర్పాటు చేసిన జీవీ మాల్ (షాప్ అండ్ సెలబ్రేట్) షోరూమ్ ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. జీవీ మాల్ షోరూమ్ ప్రారంభోత్సవానికి సినీ నటి సంయుక్త మీనన్ హాజరయ్యారు. సంస్థ ఎండీ జి.ఉమామహేశ్వరరావు, డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుకలతో కలిసి ఆమె షోరూమ్‌లో జ్యోతి ప్రజ్వలన చేసి మాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సంయుక్త మీనన్ మాట్లాడుతూ జీవీ మాల్ షోరూమ్ సంస్థ తన 15వ షోరూమ్‌ను వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువచ్చిందని తెలిపారు. అన్ని వర్గాల మహిళలు కోరుకునే విభిన్న రకాల చీరలు, డ్రెస్ మెటీరియల్స్ వంటివి ఇక్కడ లభిస్తాయని చెప్పారు. తాను కర్నూలుకు రావడం తొలిసారి అని, ఇక్కడి సంస్కృతి సంప్రదాయాలు చాలా బాగున్నాయని ప్రశంసించారు. సంస్థ ఎండీ జి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ జీవీ మాల్ షోరూమ్‌ను కర్నూలులో ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఇది తమ 15వ షోరూమ్ అన్నారు. వినియోగదారులకు అందుబాటు ధరల్లో వస్త్ర ఉత్పత్తులను మాల్‌లో ఏర్పాటు చేశామని చెప్పారు. వినియోగదారులకు ఉత్తమసేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు పోతామని, అదే తమ షోరూమ్ ప్రత్యేకత అని చెప్పారు. సినీనటి సంయుక్త మీనన్‌ను చూసేందుకు వందలాదిగా ప్రజలు షోరూమ్ వెలుపల వేచి చూశారు. ఆమె షోరూమ్ చేరుకునేవరకు కేరింతలు వేశారు.

పరదాల చాటున తిరిగే సీఎం అవసరమా..?

నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి



గౌరు సమక్షంలో టీడీపీలో చేరుతున్న నాయకులు

గడివేముల, మార్చి 13: పరదాల చాటున తిరిగే సీఎంకు మనకు అవసరమా? అని నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి అన్నారు. బుధవారం ఆయన గడివేముల మండలంలోని గడిగరేవుల గ్రామంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో గ్రామాల్లో అభివృద్ధి జరగలేదని అన్నారు. రాష్ట్రాభివృద్ధి 20 ఏళ్లు వెనక్కు వెళ్లిందని అన్నారు. బటన్ నొక్కి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని గొప్పలు చెబుతున్నారే కానీ క్షేత్రస్థాయిలో మహిళలు, యువకులు, రైతులు ఎటువంటి ఆర్థిక పురోగతి సాధించలేదని అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లేవని అన్నారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం వైసీపీ నాయకులు ఇళ్ల పట్టాలు అంటూ హడావుడి చేస్తున్నారే తప్పా ఇప్పటి వరకు ఎక్కడా జగనన్న కాలనీలు పూర్తి కాలేదని విమర్శించారు. పాణ్యం నియోజకవర్గంలో కక్ష సాధింపు చర్యలు, అక్రమ కేసుల బనాయింపు పెరిగి పోతున్నాయని అన్నారు. ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. వైసీపీ పాలనపై విరక్తి చెందిన ప్రజలు టీడీపీ వైపు చూస్తున్నారని అన్నారు. వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు పెరిగాయని అన్నారు. యువకుల్లో మార్పు మొదలైందని అన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని అన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని అన్నారు.

- వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

వైసీపీ ప్రభుత్వంపై విరక్తి చెంది ఆ పార్టీ నాయకులు టీడీపీలోకి చేరారు. మండలంలోని గడిగరేవుల గ్రామ సర్పంచ్ సోదరుడు రాంభూపాల్‌రెడ్డి, వార్డు మెంబర్ ప్రసాదులతో పాటు 50 కుటుంబాలు నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకట రెడ్డి సమక్ష్యంలో టీడీపీలో చేరారు. వారికి గౌరు వెంకట రెడ్డి తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, పాణ్యం నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కృష్ణయాదవ్, రామచంద్రారెడ్డి, శ్రీనివాసులు, శ్రీనివాసయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థుల జాబితా పరిశీలన

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 13: ఉమ్మడి కర్నూలు జిల్లాలోని గతంలో నాన్‌ఫార్మల్ ఎడ్యుకేషన్ సూపర్‌వైజర్, ఇన్‌స్ట్రక్టర్స్‌గా పని చేసిన అభ్యర్థులు సమర్పించిన ధృవపత్రాల ఆధారంగా జాబితాను తయారు చేసి ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులకు పంపినట్లు ఎస్ఎస్ఏ ఏపీసీ విజయజ్యోతి కుమారి బుధవారం తెలిపారు. ఎన్ఎఫ్ఈ సెంటర్లు నడిచిన స్థలాల్లోని సంబంధిత మండల విద్యాశాఖ అధికారులు ఆ జాబితాను రికార్డుల ఆధారంగా పరిశీలించి జాబితాలో ఏమైనా తప్పులుంటే సరి చేసి సంబంధిత విద్యార్హతలు, ఇతర పత్రాల నకలు కాపీలను ధృవీకరించి ఈ నెల 18వ తేదీలోగా జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయానికి పంపాలని కోరారు.

జర్నలిస్టులకు స్థలాలు త్వరగా గుర్తించండి

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 13: జర్నలిస్టు హౌసింగ్ స్కీంకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలం అందజేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జి. సృజన జాయింట్ కలెక్టర్‌కు సూచించారు. బుధవారం అధికారులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థలాన్ని ఎక్కడ గుర్తించారా.. దాని బేసిక్ వ్యాల్యూ సిద్ధం చేశారా..? స్థలాలు ఎంత మందికి ఇవ్వాలి..? అని డివిజనల్ అధికారులను ప్రశ్నించారు. డివిజన్‌లో ఎంత మంది డివిజన్ హెడ్ క్వార్టర్స్‌లో స్థలాలు కోరారు? మండలాల్లో స్థలాలను కోరారు? అనే వివరాలను సమర్పించాలని కర్నూలు ఆర్డీవోను ఆదేశించారు. పత్తికొండ డివిజన్‌లో 49 మంది అర్హులైన లబ్ధిదారులు ఉన్నారని, ఆదోని డివిజన్‌లో 70 మంది ఉన్నారని అధికారులు తెలిపారు. వారు కోరిన మండలాల్లో స్థలాలను గుర్తించి బేసిక్ ప్రైస్ వివరాలతో నివేదికలు బుధవారంలోపు సమర్పిస్తామని డివిజనల్ అధికారులకు తెలియజేశారు. ఈ కాన్ఫరెన్స్‌లో జేసీ నారపురెడ్డి మౌర్య, మున్సిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ శర్మ, కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి, పత్తికొండ ఆర్డీవో రామలక్ష్మి, జడ్పీ సీఈవో నాసరరెడ్డి తదితరులు ఉన్నారు.

టీడీపీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

గోస్పాడు, మార్చి 13 : తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టి మినీ మ్యానిఫెస్టో సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని మండల టీడీపీ అధ్యక్షుడు కాటంరెడ్డి తులసీశ్వరరెడ్డి, క్లస్టర్ కన్వీనర్ శ్రీనివాస యాదవ్, ఎస్ఎండీ ఫయాజ్ అన్నారు. బుధవారం గోస్పాడు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో క్లస్టర్స్ ఇన్‌చార్జిలు, బూత్ కన్వీనర్లకు బీసీ డిక్లరేషన్‌పై సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరిస్తూ 2024 టీడీపీ అధికారంలోకి వస్తే ప్రజలకు ఇవ్వబోయే మినీ మ్యానిఫెస్టో గురించి ఇంటింటికి వెళ్ళి కార్యకర్తలు, ఇన్‌చార్జిలు, కన్వీనర్లు తెలియజేయాలని కోరారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని, యువతకు ఉపాధితో పాటు రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో భూమా హుసేని, పెద్దహుసేని, పల్లె విశ్వనాథ్‌రెడ్డి, మనోజ్, గంగుల వెంకటరెడ్డి, పుండరీకాంక్షరెడ్డి, గోవింద భూపాల్‌రెడ్డి, బాలన్న, వివిధ గ్రామాలకు చెందిన బీసీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మద్దతు ధరతో జొన్నలు కొనుగోలు

జేసీ రాహుల్ కుమార్ రెడ్డి

నంద్యాల (కల్చరల్), మార్చి 13: ప్రభుత్వ కనీస మద్దతు ధరతో రైతుల నుంచి జొన్నలను (మహీంద్రా రకం) క్వింటాలు రూ.3,180తో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల నెం.255 తేదీ12-8-2024 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ కోటా కింద మహేంద్ర వెరైటీ సి-43 జొన్నలను ఈ క్రాప్, కేవైసీ చేయించుకున్న రైతుల నుంచి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తామన్నారు. జిల్లాలోని రైతులు ఎవరయితే పౌర సరఫరాల శాఖకు ఇప్పటి వరకు జొన్నలు అమ్మకాలు చేయలేదో వారు మాత్రమే మార్క్‌ఫెడ్‌కు విక్రయించేందుకు అర్హులన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు చిన్న, సన్న కారు రైతులకు ప్రయోజనం కలిగేలా గరిష్ఠంగా ఒక రైతుకు ఐదు ఎకరాల పరిమితిని విధించామని తెలిపారు. రైతులకు గోనెసంచులు, రవాణా సౌకర్యం మార్క్‌ఫెడ్ వారే కల్పిస్తారన్నారు. లారీలో లోడ్ చేసే వరకు అయ్యే హమాలీ ఖర్చులు మాత్రమే రైతులు భరించాలని తెలిపారు. గడివేముల, వెలుగోడు, పాములపాడు, నంద్యాల, శిరివెళ్ల, ఆళ్లగడ్డ, గోస్పాడు, బండిఆత్మకూరు, మండలాల రైతుల నుంచి ప్రభుత్వ మద్దతు ధరతో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు జేసీ చెప్పారు.

రెండు పది పరీక్ష కేంద్రాల ఏర్పాటు

కొత్తపల్లి, మార్చి 13: కొత్తపల్లి మండలంలో ఈ ఏడాది రెండు పదవ తరగతి రెండు పబ్లిక్ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కొత్తపల్లి, గోకవరం పరీక్షల చీఫ్ ఎగ్జామినర్లు ఇబ్రహీం, రఘుస్వామిలు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు కొత్తపల్లి సెంటరు నుంచి 240 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. అలాగే గోకవరం సెంటరు నుంచి 130 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. ఇందులో రెండు సెంటర్ల నుంచి మొత్తం 370 మంది విద్యార్థులు హాజరవుతుండగా.. ఇందులో 126 మంది ప్రైవేటు విద్యార్థులు హాజరు కానున్నారని వివరించారు. ఉదయం 9.30 గంటల నుంచి 12.45 గంటల వరకు జరిగే పరీక్ష కేంద్రాలకు అరగంట ముందే విద్యార్థులు హాజరు కావాలని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

కొత్తపల్లి, మార్చి 13: కొత్తపల్లి మండలంలో స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో గురువారం వివిధ విద్యుత్ పనుల కారణంగా నాలుగు గంటల పాటు విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ అబీద్ బుధవారం తెలిపారు. మండలంలో విద్యుత్ సరఫరాలో అప్‌డౌన్‌ను అధిగమించేందుకు క్యాపాస్టర్ బ్యాంకును ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ క్యాపాస్టర్ బ్యాంకును అమర్చేందుకు చేయాల్సిన పనుల కోసం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. ఈ అసౌకర్యాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

అబ్బీపురంలో బోరు పరిశీలన



అబ్బీపురంలో తాగునీటి బోరును పరిశీలిస్తున్న అధికారులు

మహానంది, మార్చి 13: మహానంది మండలం అబ్బీపురంలో మంచినీటి బోరుకు పైపులైన్ తగిలించి గ్రామ సర్పంచ్ భర్త తన అరటి తోటకు నీరును మళ్లించుకోవడంపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో బుధవారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నత స్థాయి అధికారులు స్పందించారు. బుధవారం మండల ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి పవన్‌కుమార్‌తో పాటు ఏఈ మహానంది నాయక్, గ్రామ పంచాయతీ కార్యదర్శి దివ్య హుటాహుటిన అబ్బీపురం చేరుకున్నారు. గ్రామ శివారు ప్రాంతంలోని రక్షిత మంచినీటికి సరఫరా చేసే బోరు పరిసరాలను పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాగునీటి బోరును పరిశీలించామని చెప్పారు. ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామని తెలిపారు.

మహానంది ఉద్యోగి శ్రీశైలానికి బదిలీ



బదిలీ నియమాక పత్రాన్ని అందజేస్తున్న ఈఓ

నంద్యాల, మార్చి 13: మహానంది దేవస్థానంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రంగన్న తిరిగి మాతృ సంస్థ శ్రీశైలం దేవస్థానానికి బుధవారం బదిలీపై వెళ్లారు. మూడేళ్ల కిందట మహానంది దేవస్థానానికి బదిలీపై వచ్చిన రంగన్న తనను తిరిగి మాతృ సంస్థకు బదిలీ చేయాలని రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్‌కు విన్నవించుకున్నారు. ఇందులో భాగంగానే శ్రీశైల దేవస్థానానికి రంగన్నను బదిలీ చేస్తూ ఉత్తర్వులను పంపడంతో మహానంది ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి దేవస్థానం ప్రధాన కార్యాలయంలో బదిలీ ఉత్తర్వుల పత్రాలను అందజేశారు. అనంతరం శాలువాతో సన్మానించి, మోమెంటో ప్రసాదం అందించారు. కార్యక్రమంలో ఏఈఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన

గోస్పాడు, మార్చి 13 : ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు బుధవారం జిల్లెల్ల రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయాధికారిణి స్వప్నిక అధ్యక్షతన పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ వారి భాగస్వామ్యంతో ఆయిల్‌ఫామ్ సాగుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయిల్ ఫామ్ సాగులో రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా జిల్లా ఉద్యానవన శాఖ నుంచి లభ్యమయ్యే సబ్సిడీ వివరాల గురించి వివరించారు. జాతీయ నూనె గింజలు, ఆయిల్ ఫామ్ మిషన్‌లో భాగంగా ఆయిల్ ఫామ్ సాగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయని, ఈ పంట మధ్యలో అంతర్ పంటలు వేసుకోవడానికి, ఆయిల్ ఫామ్ పంటకు అయ్యే ఎరువుల ఖర్చును రైతులకు సబ్సిడీ రూపంలో అందిస్తాయిని అన్నారు. దిగుబడిని పతంజలి వారే కొనుగోలు చేసి రైతుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన ధర చెల్లిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పతాంజలీ ఫుడ్స్ లిమిటెడ్ జిల్లా మేనేజర్ మహాదేవయ్య, డిప్యూటీ మేనేజర్ రమణారెడ్డి, మండల ఫీల్డ్ ఆఫీసర్ సూర్యతేజ, గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

బీసీల కోసం ప్రత్యేక చట్టం: ఫరూక్



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎన్ఎండీ ఫరూక్, టీడీపీ నాయకులు

నంద్యాల (నూనెపల్లె), మార్చి 13 : టీడీపీ అధికారంలోకి రాగానే బీసీల కోసం ప్రత్యేక చట్టం తీసుకొస్తామని పొలిట్ బ్యూరో సభ్యుడు, నంద్యాల టీడీపీ ఇన్‌చార్జి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. బుధవారం ఖలీల్ థియేటర్ ఆవరణలోని టీడీపీ కార్యాలయంలో నంద్యాల నియోజకవర్గ క్లస్టర్-4 ఇన్‌చార్జి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మణియార్ ఖలీల్ ఆధ్వర్యంలో బీసీ డిక్లరేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఫరూక్ మాట్లాడుతూ బీసీలకు అత్యున్నత స్థానం కల్పించింది టీడీపీ మాత్రమేనని చెప్పారు. బీసీలు వివిధ రంగాల్లో అభివృద్ధి చెందేందుకు చంద్రబాబు నాయుడు పెద్దపీట వేసి చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. వైసీపీ ప్రభుత్వం బీసీలను విస్మరించి బీసీలపై హత్యలు, దాడులకు తెగబడుతోందని విమర్శించారు. బీసీలంతా ఏక తాటిపైకి వచ్చి టీడీపీని అధికారంలోకి తీసుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గోవింద నాయుడు, వాల్మీకి బోయ సాధికారత సమితి జిల్లా కన్వీనర్ రామకృష్ణ, ఉప్పరి కమిటీ జిల్లా కన్వీనర్ ఉప్పరి సురేష్‌కుమార్, వడ్డెర జిల్లా కన్వీనర్ మంజుల సుబ్బరాయుడు పాల్గొన్నారు.

● **నంద్యాల రూరల్ మార్చి 13:** ఇంటింటికి సూపర్ సిక్స్ పథకం చేర్చాలని నంద్యాల అసెంబ్లీ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్ పిలుపునిచ్చారు. నంద్యాల మండలంలోని అయ్యలూరు గ్రామ టీడీపీ నాయకులతో ఫరూక్ మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాల ప్రాధాన్యతను ప్రతి ఒక్క ఓటరుకు తెలియజేయాలని కోరారు. శంఖారావం కిట్ల పంపిణీ తీరు గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు. అలాగే వెంకటేశ్వరాపురంలో ఉన్న వెంకటేశ్వర స్వామి దేవాలయంలో నిర్మించిన నూతన భోజన శాలను ఎన్ఎండీ ఫరూక్ ప్రారంభించారు.

నందనవనంగా చేస్తాం

నంద్యాల (నూనెపల్లె), మార్చి 13 : నంద్యాల పట్టణాన్ని నందనవనంగా చేస్తామని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఏవీఆర్ ప్రసాద్ ఆధ్వర్యంలో పట్టణంలోని 36వ వార్డుకు చెందిన వైసీపీ నాయకులు, యువకులు భారీ సంఖ్యలో టీడీపీలో చేరారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఎన్ఎండీ ఫిరోజ్ కండువాలు వేసి వారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో నంద్యాలలో అభివృద్ధి ఎలాంటి అభివృద్ధి జరగలేదని అన్నారు. పనులు పూర్తిగాని సగం రోడ్లకు శిలాఫలకాలు వేసుకొని రిబ్బన్ కటింగ్ చేసుకుంటూ ఇది కాదా అభివృద్ధి అంటూ గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. టీడీపీ హయాంలో కుందూ నదిపై చేపట్టిన బ్రిడ్జి ఐదేళ్ల పూర్తి కావస్తున్నా ఎందుకు పూర్తి చేయలేకపోయారని ప్రశ్నించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి: గౌరు చరిత



కరిమద్దెల గ్రామంలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న గౌరు చరిత

గడివేముల, మార్చి 13: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పాణ్యం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గౌరు చరిత అన్నారు. బుధవారం మండలంలోని కరిమద్దెల గ్రామంలో టీడీపీ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జగన్ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. నిత్యావసర ధరలు ఆకాశన్నంటాయని తెలిపారు. ధాన్యం అమ్ముకోవడానికి రైతులకు అవస్థలు పడుతున్నారని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లేవని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని అన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, శివారెడ్డి, రామచంద్రారెడ్డి, కృష్ణయాదవ్, సుభద్రమ్మ, వడ్డు లక్ష్మీదేవి, భూపాల్‌రెడ్డి, రమణయ్య, లక్ష్మీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

20 కుటుంబాలు టీడీపీలో చేరిక

పాణ్యం, మార్చి, 13: మండలంలోని కొనిదేడులో బుధవారం 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు రాంపుల్లారెడ్డి, జనసేన నాయకులు జగదీశ్ ఆధ్వర్యంలో టీడీపీలో పది కుటుంబాలు, టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో నాయకులు రాంమోహన్‌నాయుడు, మాజీ ఎంపీటీసీ తిరుపాలు, కంబయ్య, సుభాన్, ఉసేన్‌బాషా, సుబ్బరాయుడు, రమేష్, రామమద్దిలేటి, అబ్దుల్, మధు, సుబ్బయ్య, పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు.

● మండలంలోని కొనిదేడులో నూతనంగా నిర్మించిన రైసుమిల్లును నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తాతిరెడ్డి తులసిరెడ్డి, చింతల సుబ్బరాయుడు, రాంపుల్లారెడ్డి గ్రామప్రజలు పాల్గొన్నారు.

చంద్రబాబును సీఎం చేసుకుందాం

బండిఆత్మకూరు, మార్చి 13: రాష్ట్ర భవిష్యత్ కోసం చంద్రబాబు నాయుడును సీఎం చేసుకుందామని ప్రజలకు శ్రీశైలం ట్రస్టు బోర్డు మాజీ సభ్యులు చిట్టిబొట్ల భరద్వాజ శర్మ, బాలుడు సూచించారు. బుధవారం రాత్రి మండలంలోని బీ కోడూరు గ్రామంలో శంఖారావం కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ ప్రకటించి ఆరు సూపర్ పథకాలను వారు ప్రజలకు వివరించారు. అభివృద్ధి జరిగి మన పిల్ల భవిత బాగుపడాలంటే చంద్రబాబు మళ్లీ సీఎం కావాలని, అందుకు ప్రజలు ఓటు అనే ఆయుధాన్ని ఉపయోగించి వైసీపీని గద్దె దింపాలన్నారు. సైకో జగన్‌ను ఇంటికి పంపాలని కోరారు. కార్యక్రంలో ప్రతాప్, అంకిరెడ్డి, చలమయ్య పాల్గొన్నారు.

టీడీపీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి

మహానంది, మార్చి 13: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే తెలుగు దేశం పార్టీ అధికారంలోకి రావాలని మహానంది టీడీపీ నాయకులు సూరే శ్రీనివాసులు, రామచంద్రుడులు అన్నారు. బుధవారం మహానంది సమాపంలోని ఈశ్వర్‌నగర్ కాలనీలో టీడీపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించి సూపర్‌సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసి సైకో పాలనకు చరమగీతం పాడాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ గౌడ్, మునగనూరి శ్రీనివాసులు, రాముడు, ఎల్లయ్యతోపాటు ఐటీడీపీ సభ్యులు శేఖర్, సతీష్ పాల్గొన్నారు.

విద్యతోనే మహిళల సాధికారత

● సినీ నటుడు మంచు మనోజ్



పోస్టర్లను విడుదల చేస్తున్న మంచు మనోజ్, అధికారులు

నంద్యాల (నూనెపల్లె), మార్చి 13 : మహిళా సాధికారత విద్యతోనే సాధ్యమవుతుందని సినీ నటుడు మంచు మనోజ్ అన్నారు. రామకృష్ణ డిగ్రీ అటానమస్, పీజీ కళాశాలలో బుధవా రం బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమం జరిగింది. విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా మంచు మనోజ్‌తోపాటు ఐసీడీ ఎస్ అధికారి నాగ సువర్చల, డాక్టర్ ప్రసన్నలత, సీడీపీవో చంద్ర కళ హాజరయ్యారు. పోస్టర్లను వారు విడుదల చేశారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో బాలికల సంక్షేమం, చదువు కోసం భారత ప్రభుత్వం ప్రవేశపెట్టి ఈ పథకం ఎంతగానో ఉపయోగదాయకమని అన్నారు. ఆడ పిల్లల పై జరుగుతున్న దాడులు, అకృత్యాలను నియంత్రించేందుకు కఠినమైన చట్టాలను కేంద్ర ప్రభుత్వం రూపొందించాలని కోరారు. గిరిజన ప్రదేశాలలో బాలికా విద్య, సంరక్షణ అంశాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరావు, రామారావు, ప్రిన్సిపాల్ సుబ్బయ్య, డైరెక్టర్ హేమంత్‌రెడ్డి, మేనేజర్ ప్రగతిరెడ్డి పాల్గొన్నారు.

ఆత్మకూరులో నీటి కష్టాలు

● అడుగంటిన భూగర్భ జలాలు ● అల్లాడుతున్న జనాలు ● పట్టించుకోని అధికారులు



ట్యాంకర్ నీటిని పట్టుకుంటున్న జనం



కప్పలకుంటలో మరమ్మతులకు గురైన బోరును చూపుతున్న స్థానికులు

ఆత్మకూరు, మార్చి 13: ఆత్మకూరులో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. పట్టణంలోని తోటగేరి, అప్పారావు వీధి, తిక్కయ్య స్వామి దర్గా, అర్బన్ కాలనీ, వెంగళరెడ్డి, రహమత్‌నగర్, కొత్తపేట, గొల్లపేట, ఎస్సీజీపాలెం, ఏబీఎం పాలెం, ఇందిరానగర్, గాంధీపార్క్, సంత మార్కెట్ వీధి, కిషన్‌సింగ్ వీధి, సాయిబాబా నగర్, గరీబ్‌నగర్ తదితర కాలనీల్లో నీటి సమస్య తీవ్ర తరమైంది. ఇప్పటికే చేతిపంపుల్లో నీటి నిల్వలు లేక మూలనపడ్డాయి. దీనికి గృహాల్లో ఉండే బోర్లలో సైతం నీరు రాక పబ్లిక్ కుళాయిలనే ఆశ్రయించాల్సి వస్తోంది. అదేవిధంగా వెలుగోడు జలాశయం నుంచి ఆత్మకూరుకు తాగునీటిని సరఫరా చేసే పథకం కూడా అంతంతమాత్రంగానే పని చేస్తోంది. ప్రతి రోజూ సగటున 15 లక్షల లీటర్ల వరకు తాగునీటి సరఫరా జరగాల్సి ఉన్నప్పటికీ 8నుంచి9లక్షల లీటర్ల వరకే నీటి సరఫరా జరుగుతోంది. ఈ నీటిని చుట్టు పల్లెలకు మళ్లించడంతో ఆత్మకూరు పట్టణానికి నీటి వాటా గణనీయంగా తగ్గింది. ఇదిలావుంటే తాగేందుకు మాత్రం ప్రైవేట్ వ్యాపారులు ట్యాంకర్ల ద్వారా పలు కాలనీల్లో నీటిని అందుబాటులో ఉంచుతుంటే ఇతర అవసరాలకు నీరు దొరకని పరిస్థితి దాపురించింది. ఇప్పటికైనా అధికారులు నీటి సమస్యను పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నాయి.

డియర్ పేరెంట్స్ సారీ..

జగన్ సభ ఉన్నందువల్ల స్కూల్ బస్సులు పంపలేకపోతున్నాం

ప్రైవేట్ పాఠశాలల నుంచి విద్యార్థుల తల్లిదండ్రులకు మెసేజ్‌లు

నందికొట్కూరు, మార్చి 12: 'డియర్ పేరెంట్స్, నమస్తే గురువారం బనగానపల్లెలో జరిగే ముఖ్యమంత్రి సభకు రవాణ శాఖాధికారులు, విద్యాశాఖాధికారుల ఉత్తర్వుల మేరకు స్కూలు బస్సులు పంపుతున్న కారణంగా నాన్ లోకల్ విద్యార్థులకు వాహనాలు పంపలేం. కేవలం లోకల్ విద్యార్థులు యథావిధిగా స్కూలుకు హాజరు కావలెను. విద్యార్థులకు కలుగుతున్న అసౌకర్యానికి చింతిస్తున్నాం' అంటూ నందికొట్కూరు పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల తల్లిదండ్రులకు మెసేజ్ పంపారు. ఇలా పట్టణంలోని దాదాపు అన్ని పాఠశాలల యాజమాన్యాలు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు బస్సులను నిలిపివేశారు. జగన్మోహన్‌రెడ్డి పర్యటనలు విద్యారులు పాఠశాలలకు వెళ్లకుండా అడ్డంకిగా మారాయని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

అల్లర్లకు పాల్పడితే చర్యలు



బీఎస్ఎఫ్ బలగాలతో మాట్లాడుతున్న సీఐ

వెలుగోడు, మార్చి 13: రాబోయే ఎన్నికల్లో అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆత్మకూరు రూరల్ సీఐ నాగభూషణ్ హెచ్చరించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని సీఐ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది, బీఎస్ఎఫ్ బలగాలతో వెలుగోడు పట్టణంలో పొట్టి శ్రీరాములు సెంటర్ నుంచి ఓల్డ్ బస్టాండ్ వరకు బుధవారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ నాగభూషణ్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించేలా ఎన్నికల ప్రవర్తనా నియమావళి గురించి ప్రజలకు వివరించారు. ప్రజలందరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రశాంతం వాతావరణం కల్పించడమే పోలీసుల ధ్యేయమని తెలిపారు. కార్యక్రమంలో వెలుగోడు ఎస్ఐ భూపాలుడు, ఆత్మకూరు ఎస్ఐ నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థి వ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దె దింపుతాం



రఫీని ముందస్తు అరెస్టు చేసిన పోలీసులు

నంద్యాల (నూనెపల్లె), మార్చి 13 : విద్యార్థి, నిరుద్యోగుల వ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎండీ రఫీ హెచ్చరించారు. ఈ నెల 14వ తేదీన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బనగానపల్లె పర్యటన ఉండటంతో విద్యార్థి సంఘాల నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. ఇందులో భాగంగా బుధవారం త్రీటౌన్ పోలీసులు రఫీని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా రఫీ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థను అరచేతిలో పెట్టుకొని ఆటాడుకుంటున్న జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు నూకలు చెల్లాయని అన్నారు. రాష్ట్రంలో విద్యా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ సర్వనాశనం చేశారని, నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పి మోసం చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎద్దేవా చేశారు. ఇచ్చిన హామీలను మరిచిన జగన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

విద్యతోనే జీవితానికి ఉజ్వల భవిష్యత్



విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందజేస్తున్న దృశ్యం

ఆత్మకూరు, మార్చి 13: విద్యతోనే జీవితానికి ఉజ్వల భవిష్యత్ అని గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు జవహర్‌నాయక్ అన్నారు. బుధవారం ఆత్మకూరు పట్టణంలోని సమీకృత గిరిజన వసతి గృహంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యతోనే జీవితానికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్న విషయాన్ని విద్యార్థులు గుర్తించుకోవాలని అన్నారు. విలువైన సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళికాబద్ధంగా చదివితే చక్కటి ఫలితాలను పొందవచ్చునని తెలిపారు. ప్రత్యేకించి పరీక్షలంటే భయపడకూడదని సూచించారు. పరీక్షా రాసే క్రమంలో ఉపాధ్యాయుల సూచనలను తప్పక పాటించాలని చెప్పారు. సకాలంలో పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, హాల్ టికెట్ అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ భాస్కర్, ఉపాధ్యాయులు కృష్ణయ్య, కృష్ణకాంత్ తదితరులు ఉన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవ పూజలు

పాములపాడు, మార్చి 13: మండల కేంద్రంలోని చౌడేశ్వరిదేవి ఆల యంలో అమ్మవారికి పురోహితులు కోదండ రామయ్యశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం చౌడేశ్వరిదేవి 13వ ఆలయ వార్షికోత్సవ పూజల ను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అభిషేకాలు, కుంకుమార్చనలు, లలిత సహస్ర నామావళి నిర్వహించారు. మహిళలు పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.



చౌడేశ్వరి అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలి

కొత్తపల్లి, మార్చి 13: క్షేత్ర స్థాయిలో వలసల నివారించాలంటే ప్రతి కూలికి జాబ్‌కార్డులు ఇచ్చి పనులు కల్పించాలని ఎంపీడీవో జవహర్‌బాబు ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏపీవో రేష్మా ఆధ్వర్యంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు ఉపాధి సిబ్బంది పను లపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో ప్రతి రోజూ 3,175 పని దినాలు తగ్గకుండా మార్చి నెల చివరి వరకు పనులు కల్పించాలన్నారు. అలాగే ప్రతి కుటుంబానికి కేటాయించిన వంద రోజుల పని దినాలు పూర్తి చేయాలన్నారు. జాబ్‌కార్డులలో ఎవరైనా చనిపోయిఉంటే వారి పేర్లను తొలగించి కొత్తవారికి అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో రాజు నాయక్, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో జవహర్‌బాబు

సమాధులనూ వదలరా?

జనసేన, బీజేపీ నాయకుల ధ్వజం



గ్రీన్‌పార్క్ ప్రదేశంలో జనసేన, బీజేపీ నాయకుల ఆందోళన

డోన్(రూరల్), మార్చి 13: సమాధులు ఉన్న ఖాళీ స్థలాలను కూడా వదలరా? అని జనసేన, బీజేపీ నాయకులు ధ్వజమెత్తారు. బుధవారం పట్టణ సమీపంలోని సాక్షినివాస్ గ్రీన్ పార్క్‌లోని పది సెంట్ల స్థలంలో కొందరు వ్యక్తులు వచ్చి ఆక్రమణకు పూనుకుంటున్నారని బీజేపీ, జనసేన నాయకులు అడ్డగించారు. జనసైనికులు అనిల్‌సాయి కుటుంబానికి అనుబంధంలో ఉన్న స్థలాన్ని మున్సిపల్ అధికారులు చెప్పారని కొందరు వ్యక్తులు ఆ స్థలాన్ని స్వాధీన పరచుకునే ప్రయత్నం చేశారు. జనసేన నాయకులు ఆలా మోహన్ రెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శి వడ్డె మహారాజ్ ఆ ప్రాంతంలోని కాలనీవాసులతో కలిసి అడ్డుకున్నారు. దీంతో ఆ ప్రాంతంలో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

బార్ అసోసియేషన్‌కు ఎన్నికలు

ఆళ్లగడ్డ, మార్చి 13: ఆళ్లగడ్డ బార్ అసోసియేషన్‌కు ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు న్యాయవాదులు బాలగురురెడ్డి, నాగేశ్వరరెడ్డి తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఈ నెల 15వ తేదీన నామినేషన్లను ఉదయం 10.30 గంటల నుంచి సాయింత్రం 4 గంటల వరకు స్వీకరిస్తామని, నామినేషన్లకు ఈనెల 16 చివరి తేదీ అన్నారు. 18న నామినేషన్లను పరిశీలిస్తామని, 19వ తేదీ నామినేషన్లను ఉపసంహరణకు చివరి రోజని తెలిపారు. ఈ నెల 22వ తేదీ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ ఉంటుందని, అదే రోజు 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు జరిపి ఎంపికైన నూతన కార్యవర్గ సభ్యులను ప్రకటిస్తామని చెప్పారు.

పేరుసోములలో నీటి ఎద్దడిని నివారిస్తాం

సంజామల,, మార్చి 13: మండలంలోని పేరుసోములలో ఉన్న నీటి ఎద్దడిని నివారిస్తామని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి బుధవారం అన్నారు. గ్రామం లోని కొత్తబస్టాండ్ తదితర ప్రాంతాల్లో తాగునీరు, ఇతరత్రా అవసరాలకు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలసుకున్న స్థానిక టీడీపీ నాయకులు బెలుం సురేశ్‌రెడ్డి పేరుసోములలో నీటి సమస్య గురించి ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన బీసీ జనార్దన్‌రెడ్డి సొంత నిధులతో పేరుసోములలోని కొత్తబస్టాండ్ సమీపంలోని కాలనీలకు ట్రాక్టర్ ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేసి కాలనీవాసుల దాహార్తిని తీర్చారు. వేసవి ముగిసే వరకు గ్రామంలో తాగునీటి సమస్యలేకుండా నీటిని సరఫరా చేస్తామని బీసీ గ్రామస్థులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బీసీ జనార్దన్ రెడ్డికి కాలనీవాసులు ధన్యవాదాలు తెలిపారు.

కోట్ల పర్యటనను విజయవంతం చేయండి

బేతంచెర్ల, మార్చి 13: మండలంలో డోన్ నియోజకవర్గ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి గురువారం పర్యటించనున్నారు. బేతంచెర్ల పట్టణంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నగర పంచాయతీలోని 5వార్డులో ఆయన ప్రచార కార్యక్రమం కొనసాగుతుంది. అలాగే మండలంలో గోరుమానుకొండ, సీతారామాపురం, సంకలాపురం గ్రామాల్లో సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రచారం సాగిస్తారు. ఈ కార్యక్రమాలను మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విజయవంతం చేయాలని బేతంచెర్ల మండల టీడీపీ నాయకులు కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్యాపిలి, మార్చి 13: మండలంలోని బూరుగుల గ్రామంలో టీడీపీ వర్గీయుడు పాములేటి కుమారుడు ఆరేళ్ల బాలుడు నరసింహ అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. మాజీ కేంద్ర మంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి కూతురు నివేదిత బాలుడి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ఆర్థిక సాయం అందజేశారు. ఆమె వెంట టీడీపీ రాష్ట్ర బీసీ సాధికార సమితి కన్వీనర్ వై నాగేశ్వరరావుయాదవ్, నాయకులు గండికోట రామసుబ్బయ్య, హేమంత్‌రెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐ టీడీపీ తాలుకా వైస్ ప్రెసిడెంటుగా గురప్ప

రుద్రవరం, మార్చి 13 : ఆళ్లగడ్డ తాలుకా ఐ టీడీపీ వైస్ ప్రెసిడెంట్‌గా ఎం.గురప్పను నియమించారు. ఈ మేరకు జాతీయ టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ బాబు, రాష్ట్ర అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడు, ఐటీడీపీ అధ్యక్షులు చింతకాయల విజయ్ నుంచి ఉత్తర్వులు అందినట్లు తెలిపారు. పార్టీ ప్రచారం చేస్తూ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

ఆలయాభివృద్ధికి రూ.50వేలు విరాళం

బనగానపల్లె, మార్చి 13: బనగానపల్లె పట్టణానికి చెందిన కంపమల్ల పెద్దసుబ్బారెడ్డి, వెంకటలక్ష్మమ్మల జ్ఞాపకార్థం వారి మనుమరాలు ధాత్రి బుధవారం నందవరం ఆలయాభివృద్ధికి రూ.50వేల చెక్కును విరాళం అందజేశారు.

రూ.18 లక్షలతో కెపాసిటర్ బ్యాంకు ఏర్పాటు

రుద్రవరం, మార్చి 13: రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు రూ.18 లక్షలతో కెపాసిటర్ బ్యాంకు ఏర్పాటు చేసినట్లు ఏఈ రాఘవేంద్రరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని చిన్నకంబలూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో రూ.18 లక్షలతో ఏర్పాటు చేసిన కెపాసిటర్ బ్యాంకును ఆయన ప్రారంభించారు. వ్యవసాయ బోరు బావులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. అసిస్టెంటు ఇంజనీరు గౌడ్, లైన్‌ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు పాల్గొన్నారు.

వైసీపీని సాగనంపండి: మాజీ మంత్రి



ముస్లింలతో మాట్లాడుతున్న భూమా అఖిలప్రియ

చాగలమర్రి, మార్చి 13: వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ పిలుపునిచ్చారు. బుధవారం చాగలమర్రి 1, 2 వార్డుల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. అఖిలప్రియ చాగలమర్రికి రాగానే టీడీపీ నాయకులు, కార్యకర్తలు గజమాలలతో స్వాగతం పలికారు. అనంతరం ఆమె ఇంటింటికి తిరిగి టీడీపీ సూపర్-6 మ్యానిఫెస్టో కరపత్రాలను అందజేశారు. ఆమె మాట్లాడుతూ వైసీపీ నేతలు సిద్ధం అంటూన్నారే కానీ రాష్ట్ర ప్రజలు మాత్రం వైసీపీని ఇంటికి పంపేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమని అన్నారు. రాయలసీమలో ప్రాజెక్టులు, పరిశ్రమల గురించి పట్టించుకోలేదని అన్నారు. సీఎం జగన్ రాయలసీమలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదని, సీమ ద్రోహి సీఎం జగన్ అన్నారు. గ్రామాల్లో పనులు పూర్తి కాకపోయిన ఎమ్మెల్యేలు శిలాఫలకాలు ప్రారంభించడానికే సరిపోయారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మైనార్టీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా, బీసీ సెల్ నంద్యాల స్పోక్‌పర్సన్ సల్లానాగరాజు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, టీడీపీ నాయకులు కొలిమి ఉసేన్‌వలి, కొలిమి షరీఫ్, మౌళాలి, అనిఫ్, రఫిద్దిన్, ఖాజా రసూల్, అజీమ్, కరిముల్లా, నూర్‌బాష, గఫార్, నాగూర్‌వలి, జెట్టి నాగరాజు, భాస్కర్‌రెడ్డి, ఓబులేసు, బషీర్, రియాజ్, ఖలీల్, సీమాంధ్ర బీసీ సంఘం అధ్యక్షుడు మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

చెర్లోపల్లెలో వైసీపీకి భారీ షాక్

మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో 80 కుటుంబాలు టీడీపీలో చేరిక

బనగానపల్లె, మార్చి 13: బనగానపల్లె నియోజకవర్గం అవుకు మండలం చెర్లోపల్లె గ్రామంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో చెర్లోపల్లె వైసీపీకి చెందిన 80 కుటుంబాలు బుధవారం మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి, ఐవీ ఫక్కీరారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. బీసీ వీరికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు యనమల నారపు రెడ్డి, కుంచెపు రామచంద్రుడు, మక్కల రమణ, షేక్షావలి, చాంద్‌బాషా, హుసేన్ బాషా, డ్రైవర్ బాషా, పండిపోటి రమణ, మంజుల వెంకటరమణ, మక్కల



ఆర్థిక సాయం అందజేస్తున్న బీసీ జనార్దన్‌రెడ్డి

శ్రీరాములు, మక్కల వెంకటేశ్వర్లు, డేరంగుల నాగేశ్, నర్సిపల్లె రామయ్య, కొండప్ప తదితరులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప చెర్లోపల్లెలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. వైసీపీ హయాంలో వేల మంది నిరుద్యోగులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోల్పోయారన్నారు. టీడీపీలో చేరిన నాయకులు మాట్లాడుతూ గత ఎన్నికల్లో బీసీ జనార్దన్‌రెడ్డిని గెలిపించుకోలేకపోవడం మన దురదృష్టమన్నారు. బనగానపల్లె నియోజకవర్గాన్ని రూ.1800 కోట్లతో బీసీ అభివృద్ధి చేశారన్నారు. కానీ మాయమాటలు నమ్మి జగన్ ప్రభుత్వానికి ఓటు వేసి మోసపోయామన్నారు. కార్యక్రమంలో ఎస్‌వీ శివరామిరెడ్డి, కె.బాలనాగిరెడ్డి, గౌరు రామిరెడ్డి, కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

బాధిత రైతుకు రూ.లక్ష ఆర్థిక సాయం : మండలంలోని క్రైప గ్రామానికి చెందిన తెలుగు మధు అనే రైతుకు చెందిన జొన్నచొప్ప దగ్ధమైంది. మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి ఆ రైతుకు బుధవారం రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. 250 ట్రిప్పుల జొన్న చొప్ప దగ్ధమైన అయిన రైతును బీసీ జనార్దన్‌రెడ్డి పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు క్రైప రఘునాథరెడ్డి, అక్బర్‌బాషా, బోయ నాగేంద్ర, తెలుగు గోపాల్, తమ్మరాజు పాల్గొన్నారు.

వైసీపీకి ప్రజలే బుద్ధి చెబుతారు: బీసీ

కోవెలకుంట్ల: రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం కోవెలకుంట్ల పట్టణంలోని సంతపేటలో బాబుష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి టీడీపీ సూపర్ సిక్స్ పథకాల కరప త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీసీ జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని రైతుల సమస్యలను ఎమ్మెల్యే కాటసానిరామిరెడ్డి గాలికి వది లేశారని అన్నారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, పంట రుణాలు సకాలంలో సాగు నీరు, సాంకేతిక పనిముట్లు ఇప్పించడంలో ఎమ్మెల్యే విఫలమయ్యారని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వస్తే అన్నదాత పథకం ద్వారా ప్రతి రైతుకు ఏడాదికి రూ.20వేలు ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ వదులుతానని చెప్పిన సీఎం జగన్ అసమర్థ నిరుద్యోగులను నిలువునా ముంచారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గడ్డం నాగేశ్వరరెడ్డి, సౌదరదిన్నె సుబ్బారెడ్డి, శంకర్‌రెడ్డి, బీవీ. ప్రసాదరెడ్డి, పెనుగొండ రాజశేఖర్, డాక్టర్ పేరా శ్రీధర్‌రెడ్డి, గడ్డం అమర్‌నాథరెడ్డి, లాయర్లు ఆంజనేయులు, శ్రీకాంత్, రామ్మోహన్‌రెడ్డి, కుళాయి, జనసేన నాయకుడు నాగప్రసాద్ పాల్గొన్నారు.



టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి

వైసీపీ పాలనలో రాష్ట్రం దివాలా: కోట్ల నివేదిత



టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తున్న కోట్ల నివేదిత

డోన్, మార్చి 13: వైసీపీ పాలనలో రాష్ట్రం దివాలా తీసిందని డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి కూతురు కోట్ల నివేదిత అన్నారు. బుధవారం పట్టణంలోని 22వ వార్డులో టీడీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఇంటింటికి తిరిగి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. కోట్ల నివేదిత మాట్లాడుతూ వైసీపీ పాలనలో ప్రజలపై అప్పుల భారం మోపడం తప్ప మేలు జరిగిందేమీ లేదన్నారు. నిత్యావసర ధరలు భారీగా పెరగడంతో సామాన్యులు ఏమీ కొనలేని, తినలేని పరిస్థితి ఉందన్నారు. చెత్తపై కూడా పన్ను వేసే దుస్థితిని వైసీపీ ప్రభుత్వంలోనే చూస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్రికే ఫణిరాజ్, సీనియర్ న్యాయవాదులు శ్రీనివాసభట్, భాస్కర్ రెడ్డి, పట్టణ టీడీపీ ప్రధాన కార్యదర్శి ఎస్ఎండీ రఫీ, బాష్యం శ్రీధర్‌గౌడు, టీఈ రాఘవేంద్రగౌడు, కేఈ శ్యాం, దిలీప్ రెడ్డి, ఎల్లగౌడు, ధను, చాటకొండ రజని పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల అభివృద్ధి

గోసానిపల్లె జయహో బీసీలో నాయకులు



గోసానిపల్లిలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

డోన్, మార్చి 13: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే బీసీల అభివృద్ధి సాధ్యమవుతుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామక్రిష్ణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్ అన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని గోసానిపల్లె గ్రామంలో టీడీపీ ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వలసల రామక్రిష్ణ మాట్లాడుతూ బీసీ డిక్లరేషన్‌లో చంద్రబాబు ఎన్నో పథకాలను ప్రకటించి అండగా నిలిచారన్నారు. బీసీ సామాజికవర్గాలకు 50 ఏళ్లకే రూ.4వేల పించన్ ఇస్తామని టీడీపీ హామీ ఇచ్చిందన్నారు. కేశన్నగౌడు మాట్లాడుతూ బీసీ సబ్‌ప్లాన్ నిధులను కేవలం బీసీల అభ్యున్నతికే వినియోగించేలా చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. బీసీల కోసం ప్రత్యేక రక్షణ చట్టం తీసుకువస్తానని చంద్రబాబు హామీ ఇవ్వడం హర్షణీయమన్నారు. డోన్ నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని గెలిపించుకునేందుకు బీసీలంతా కలిసికట్టుగా పని చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రంజిత్ కిరణ్, మాజీ సర్పంచ్ శ్రీరాములు, రైతు సంఘం అధ్యక్షుడు మల్లయ్య, మిద్దెపల్లి గోవిందు, భూమా నాగన్న, రంగనాథం, వలసల బాలుడు, వెంకటాపురం పెద్దయ్య, సంజీవుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అధికారంలోకి వస్తే బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం

ప్యాపిలి: టీడీపీ అధికారంలోకి వస్తే బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం అమలు చేస్తామని ఆ పార్టీ రాష్ట్ర బీసీ సాధికార సమితి కన్వీనర్ వై నాగేశ్వరరావుయాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని జలదుర్గం గ్రామంలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో బీసీలకు తీరని అన్యాయం జరుగుతున్నదన్నారు. బీసీ కుటుంబాలపై దాడులు పెరిగి పోయాయని విమర్శించారు. బీసీ కార్పొరేషన్ల రాయితీ రుణాలను రద్దు చేసి వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగ యువకుల కడుపు కొడుతున్నదని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి బీసీలంతా కలసి కట్టుగా పనిచేయాలని నాగేశ్వరరావుయాదవ్ పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామక్రిష్ణ, నాయకులు ఆర్ఈ నాగరాజు, గండికోట రామసుబ్బయ్య బీఈ రమణగౌడు, నబీ రసూల్, శ్రీకాంత్‌నాయుడు, మాధవరం లక్ష్మీనారాయణ, మధుశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు



పేరుసోములలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

సంజామల, మార్చి 13: ప్రకృతి వ్యవసాయంపై బుధవారం పేరుసోములలో ప్రకృతి వ్యవసాయ డీపీఎం సలాం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, రైతులతో ప్రకృతి వ్యవసా యం ద్వారా పెరటితోటల పెంపకం వాటి లాభాల గురించి వివరించారు. అనం తరం ర్యాలీ నిర్వహించారు. రసాయన ఎరువుల వినియోగంతో పండే పంటలు విషతుల్యమైనవన్నారు. ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండే పం టలు వినియోగించాలని కోరారు. అవుపేడ, ఆవు మూత్రం, ద్రవఘన జీవామృతాల ద్వారా పండించే ప్రకృతి పంటలు అమృతం లాంటివని అన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శివరామయ్య, ప్రసాద్, నాగేంద్ర, ఉపాధ్యాయులు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థినుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

చాగలమర్రి, మార్చి 13: చాగలమర్రి కస్తూర్బా పాఠశాలలో 6 నుంచి 11వ తరగతి వరకు విద్యార్థినుల నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ సునీత సూచించారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఏప్రిల్ 11వ తేదీ వరకు పాఠశాలలో చేరబోయే విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. 7, 8 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని అన్నారు. అనాథలు, బడి బయటి పిల్లలు, డ్రాపౌట్స్, ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థినుల వివరాలను పరిశీలించి పాఠశాల నోటీసు బోర్డులో ఉంచుతామని అన్నారు.

1,380 మందికి రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ

చాగలమర్రి, మార్చి 13: మండలంలోని 1,380 మందికి బయోమెట్రిక్ ద్వారా ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేసినట్లు తహసీల్దార్ రమణమ్మ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ 1651 మంది లబ్ధిదారులు రిజిస్ట్రేషన్‌లు చేసుకున్నారని పేర్కొన్నారు. పట్టా పొందిన లబ్ధిదారులందరికీ రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తామని అన్నారు. భూ రీసర్వే ద్వార భూ సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు.

పరీక్షా కేంద్రం తనిఖీ

చాగలమర్రి, మార్చి 13: చాగలమర్రిలోని వాసవీ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని జిల్లా సిట్టింగ్ స్క్వాడ్ మురళీమోహన్‌రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థుల ప్రశ్న పత్రాల రికార్డులను పరిశీలించారు. 333 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 50 మంది గైర్హాజరయ్యారని అన్నారు. మాస్‌కాపింగ్ ప్రోత్సహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట సీఎస్, డీవో ఉన్నారు.

పది పరీక్షలకు 906 మంది విద్యార్థులు

చాగలమర్రి, మార్చి 13: చాగలమర్రిలోని మూడు పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో 906 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఎంఈవో అనూరాధ తెలిపారు. బుధవారం ఎమ్మార్సీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ బాలుర, బాలికల, సేయింట్ ఆన్స్ పాఠశాలలను పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేశామని అన్నారు. ఆయా పరీక్షా కేంద్రాలకు సీఎస్‌లుగా నరసింహులు, వెంకటేశ్వర్లు, సుధాకర్‌లను నియమించారని తెలిపారు. పోలీసు స్టేషన్‌లో రెండు సెట్ల ప్రశ్న పత్రాలను భద్రపరిచామని అన్నారు. 40 మంది ఇన్విజిలేటర్లను నియమించామని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈవో-2 న్యామతుల్ల, సీఆర్పీలు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతి పూజ

చాగలమర్రి, మార్చి 13: చాగలమర్రి బాలికోన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థినులు బుధవారం పాఠశాలలో సరస్వతిదేవి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హెచ్ఎం విజయలక్ష్మి ఆధ్వర్యంలో సరస్వతిదేవికి పూజలు పూజలు చేశారు. పాఠశాలలో పది విద్యార్థినుల వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. బాలికల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయినులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలలో మరణాలపై విచారణ చేయాలి: సీపీఐ



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

బేతంచెర్ల, మార్చి 13: బేతంచెర్ల పట్టణంలోని శేషారెడ్డి ప్రభుత్వ వైద్యశాలలో జరిగే మరణాలపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులైన డాక్టర్లపై తక్షణమే సుమోటోగా కేసు నమోదు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్‌యన్నా, సహాయ కార్యదర్శులు తిరుమలేష్, దస్తగిరి, పట్టణ కార్యదర్శి నాగరాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి ఎల్లక్రిష్ణ డిమాండ్ చేశారు. బుధవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పట్టణానికి చెందిన గర్భిణి ప్రసవం కోసం ప్రభుత్వ వైద్యశాలకు సోమవారం రాత్రి వెళ్లిందని, అయితే వైద్యులు అందుబాటులో లేరని అన్నారు. మంగళవారం ఉదయం డాక్టర్ వచ్చేంత వరకు వేచి చూడాల్సి వచ్చిందని, సకాలంలో వైద్యం అందకపోవడంతో శిశువు మృతి చెందిందని అన్నారు. ఆర్థిక మంత్రి బుగ్గన ఇంటికి కూతవేటు దూరంలో ఉన్న ప్రభుత్వ వైద్యశాల మరణశాలగా మారిపోయిందని అన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయి

చాగలమర్రి, మార్చి 13: రాష్ట్రంలో రాక్షస పాలన సాగిస్తున్న వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయని ఆళ్లగడ్డ టీడీపీ యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్-6 మ్యానిఫెస్టోను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, ఆళ్లగడ్డ ఐటీడీపీ ఉపాధ్యక్షురాలు శజ్జారెడ్డి, టీడీపీ నాయకులు ఇండ్ల లక్ష్మీరెడ్డి, రమణారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, హరిశ్చంద్రారెడ్డి, ఓబయ్య, శ్రీనివాసరెడ్డి, రామ్మోహన్, షరిఫ్, రసూల్, హరి, సుబ్రమణ్యం, బాష, బాలుడు, సాయిరెడ్డి పాల్గొన్నారు.

మహిళా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

చాగలమర్రి, మార్చి 13: మహిళా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. బుధవారం చాగలమర్రి గ్రామంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలు చేయూత పథకం కింద మంజూరైన చెక్కును ఆయన పంపిణీ చేశారు. 2,831 మందికి రూ.5.35 కోట్లు మంజూరైందని ఏపీఎం నాగమ్మ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ తులశమ్మ, జిల్లా జేసీఎస్ కన్వీనర్ షేక్.బాబులాల్, ఎంపీపీ వీరభద్రుడు, మండల కన్వీనర్ కుమార్‌రెడ్డి, మహిళా డైరెక్టర్ బాల విద్యా, ఏవో రాజేంద్రప్రసాదు పాల్గొన్నారు.

రుద్రవరం: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే బిజేంద్రరెడ్డి అన్నారు. రుద్రవరంలో నాలుగో విడత రూ.4.81 కోట్లతో కూడిన ఆసరా చెక్కును మహిళలకు అందించారు. కార్యక్రమంలో పుట్టాలమ్మ క్షేత్రం చైర్మన్ గం గుల మనోహర్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ గంధం రాఘవరెడ్డి, ఎంపీ డీవో రామచంద్ర, ఏపీఎం కల్పలతాదేవి, జడ్పీటీసీ మాధవి పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు: సీడీపీవో



విద్యార్థినులకు అవగాహన కల్పిసున్న సీడీపీవో

డోన్(రూరల్), మార్చి 13: చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డోన్ ఐసీడీఎస్ సీడీపీవో శంషాద్‌బేగం, సూపర్‌వైజర్ అరుణకుమారి అన్నారు. మండలంలోని ధర్మవరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్త ఎస్.జులైఖ అధ్యక్షతన భేటీ బచావ్.. భేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు చదువు ఆవశ్యకత గురించి అవగా హన కల్పించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ పోలీసు గంగాభవాని, అంగన్‌వాడీ హెల్పర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులు చదువుపై శ్రద్ధ చూపాలి



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వై జర్

ఆళ్లగడ్డ, మార్చి 13: విద్యార్థినులు చదువుపై శ్రద్ధ చూపాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దస్తగిరమ్మ అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని పడకండ్ల కేపీజీ పాఠశాలలో భేటీ బచావో- భేటీ పడావో కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ కల్గి ఉండాలని, పోక్సో చట్టం, లింగ వివక్షలో స్త్రీ, పురుషులకు ఉన్న తేడాపై, ఆడపిల్లల చదువు, భద్రత, లైంగిక వేధింపులు వంటి వాటిపై వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం రామచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ మధుసూదనరావు, అంగన్‌వాడీ టీచర్లు నాగేంద్రమ్మ, ఉమ, సాలమ్మ, పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో మురుగు

చాగలమర్రి, మార్చి 13: చాగలమర్రి తహసీల్దార్ కార్యాలయంలో మురుగు నీరు నిలిచి దుర్గంధంగా మారింది. కార్యాలయానికి వచ్చే అధికారులు, రైతులు, ప్రజలు ముక్కున వేలేసుకొని వెళ్లాల్సి వస్తోంది. కార్యాలయం ప్రాంగణంలోనే మురుగు నీరు నిలిచినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. కార్యాలయం వద్ద మురికి కాలువ నిండి మురుగు కార్యాలయంలో ప్రవహిస్తోంది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి మురుగు తొలగించాల్సిన అవసరం ఉంది.

మోడువారిన నల్లమల.. మధ్యలో రైలు పట్టాలు

నల్లమల అడవి ఎండలకు మోడివారిపోయింది. నంద్యాల - ప్రకాశం జిల్లాల మధ్య ఒకప్పుడు పచ్చని వృక్షాల మధ్య రైలు ప్రయాణం ఆహ్లాదంగా ఉండేది. నేడు ఎండిపోయి, ఆకురాలిన చెట్లతో నల్లమల కళావిహీనంగా తయారైంది.

- రుద్రవరం



నంద్యాల, ప్రకాశం జిల్లాల సరిహద్దుల్లో రైలుపట్టాలు ఇలా..